క్లుప్తంగా

స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లోని దీక్షా స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అడిక్‌మెట్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమన్నారు. విద్యను వ్యాపారంగా కాకుండా సేవాభావంతోనే అందించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.గోవిందరావు, ప్రిన్సిపల్ కవిత, నాయకులు మాధవ్, చిట్టి, నేత శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: గత కొద్ది రోజులుగా తాగునీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులకు విన్నవించారు. శనివారం జలమండలి ఏఈ భావనను కలిసిన కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. నారాయణగూడ రిజర్వాయర్‌లోని మెయిన్‌వాల్వు చెడిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని వెంటనే వాల్‌కు మరమ్మతులు చేయించాలన్నారు. బీజేపీ నేతలు కన్నె ఉమారమేష్‌యాదవ్, ప్రతిభ, భీమ్‌రాజ్, బాలప్రసాద్, ఎస్.రవియాదవ్, దినేష్ బాబు తదితరులున్నారు.

విస్తృతంగా బీజేపీ ప్రవాస్ అభియాన్

అంబర్‌పేట: మహిళా శిశుసంక్షేమానికి అన్ని ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని బీజేపీ ఒడిస్సా రాష్ట్ర మహిళామోర్చా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శృతి పట్నాయక్ ఆకాంక్షించారు. బీజేపీ చేపట్టిన ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆమె శనివారం అంబర్‌పేట డివిజన్‌లో విస్తృతంగా పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశవర్కర్లతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. చిన్నారులు, గర్భిణీలకు అందుతున్న పోషక ఆహారాలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు పద్మా వెంకట్‌రెడ్డి, కన్నె ఉమారమేష్‌యాదవ్, అమృత, స్థానిక మహిళా మోర్చా నేతలు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి బీసీ బిల్లుపై అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. దేశంలో 54 శాతం ఉన్న బీసీ కులాలకు జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీ మహాసభ ప్రతినిధులు కృష్ణ, ముత్యాలరావు, సాంబశివగౌడ్, శివనాగేశ్వర్‌రావు, నల్లెల కిషోర్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలి

ముషీరాబాద్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ స్మారక సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాంనగర్‌గుండులోని సంస్థ కార్యాలయంలో జాతీయ పతాక 102వ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలు సంస్థ చైర్మన్ కే.హెచ్.ఎస్.జగదాంబ ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డిలు హాజరై పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు జ్ఞాపికలు, పింగళి వెంకయ్య చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. టీపీసీసీ కార్యదర్శి కేశవ్, పొన్నాల సుబ్రహ్మణ్యం, శ్యామలరావు తదితరులున్నారు.

చికెన్ పాక్స్ పంజా !



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

- ఫీవర్‌కు పెరుగుతున్న కేసుల సంఖ్య
- గత నెలలో ఫీవర్ ఆసుపత్రికి 256 చికెన్ పాక్స్ కేసులు
- 196 మీజిల్స్ కేసులు నమోదు

నల్లకుంట: వేసవి కాలం ప్రారంభమైతే చాలు చికెన్ పాక్స్ (ఆటలమ్మ), మీజిల్స్, గవద బిళ్లలు వంటి సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తోంది. ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాల్లో చిన్నారులు ఈ సమస్యతో బాధపడుతున్నారు. చాలా మంది తమ పిల్లల్ని చికిత్సల కోసం ఆస్పత్రులకు తీసుకొస్తుంటే కొంత మంది నాటు వైద్యం చేయిస్తున్నారు. అన్ని వయస్సుల వారికి సోకే ప్రమాదం.

- ఈ వ్యాధి అన్ని వయస్సుల వారికి సోకే ప్రమాదం ఉన్నా.. చిన్నారులకు త్వరగా వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు.
- ఈ వ్యాధి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు ఏర్పడి నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. ముందు జాగ్రత్తలతో ఈ ప్రమాదకర అంటువ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.
- చిన్నారులు, 15 ఏళ్లలోపు బాల బాలికల పట్ల శ్రద్ధ వహించాలని చెబుతున్నారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మార్చి నెలలో 256 చికెన్ ఫాక్స్, 196 మీజిల్స్ కేసులు నమోదయ్యాయి.

జాగ్రత్త వహించాలి..

- వేసవిలో చిన్నారుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్యలు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.
- ఈ వ్యాధి సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారని ఆకలిలేకపోవడంతో ఆహారం సరిగ్గా తీసుకోలేక బాగా నీరసించిపోతారు. చర్మంపై నీటి పొక్కులు, దురదలు వంటి లక్షణాలు వారం నుంచి 15 రోజులకు పైగా బాధిస్తాయి. తొలుత జలుబుతో ప్రారంభమయ్యే ఈ వ్యాధులు క్రమంగా వాటి ప్రభావం చూపుతాయి.

నాటు వైద్యం ప్రమాదం..

చికెన్‌పాక్స్ వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు మూఢనమ్మకాలు పెట్టుకోకుండా వైద్యులను సంప్రదించాలి. చాలా మంది మూఢ నమ్మకాలతో వైద్య సాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

- ఆటలమ్మకు నాటు వైద్యం ప్రమాదం. వైద్యుల సలహా తీసుకుని అవసరమైన మందులను క్రమం తప్పకుండా వాడాలి. వ్యాధి ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. గర్భిణీలపై ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

- శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి తక్షణం వైద్యులను సంప్రదించాలి.
- నాటు వైద్యం వైపు వెళ్లకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి యాంటీ వైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది. తద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడమే కాకుండా వేగంగా నయం కావడానికి అవకాశం ఉంటుంది.

అంటు వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి..

- సాధారణంగా ఈ వ్యాధులు వారం నుంచి 15 రోజుల వరకు ఉంటాయి. ఆటలమ్మ అంటు వ్యాధి కావడం వల్ల ఈ వ్యాధి సోకిన వారు ఇంట్లో మిగిలిన వారికి దూరంగా ఉండాలి.
- వ్యాధి సోకిన పిల్లలను పాఠశాలలకు పంపించకూడదు. రోజూ స్నానం చేయించవచ్చు. జ్వరం ఉంటే వేడి నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి.
- దురద రాకుండా పరిశుభ్రత పాటించాలి. చిన్నారులకు చేతిగోళ్లు తీసివేయడంతో పాటు పౌష్టికాహారం అందించాలి.
- ఆటలమ్మ సోకిన వారు కోరినవన్నీ ఇవ్వాలన్న అపోహలతో అన్ని రకాల తినుబండారాలను ఇవ్వడం మంచిది కాదు. తేలికగా జీర్ణమయ్యే మంచి పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలి.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, మీజిల్స్, గవద బిళ్ల వంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యలతో బాధపడుతుంటారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులను వాడాలి.

– డాక్టర్ కె.శంకర్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్

నేటితో ముగియనున్న క్రాఫ్ట్ బజార్



ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల హస్తకళలు



హస్తకళలను కొనుగోలు చేస్తున్న యువతులు

- మార్చి 24న ప్రారంభమైన హస్తకళ ఎగ్జిబిషన్
- నగర వాసుల నుంచి విశేష స్పందన

కవాడిగూడ: నగరంలోని ఎన్టీఆర్ (కళాభారతి) స్టేడియంలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ వికాస్ సంస్థాన్, ఘజియాబాద్ (ఉత్తరప్రదేశ్) డెవలప్‌మెంట్ కమిషనర్ (హస్తకళలు) టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మార్చి 24న ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్ (హస్తకళా ప్రదర్శన)కు అనూహ్య స్పందన లభిస్తోంది.

- క్రాఫ్ట్ బజార్‌లో దేశం నలుమూలల నుంచి హస్తకళాకారులు తమ హస్తకళలతో తయారు చేసిన హస్తకళారూపాలకు గిరాకీ పెరిగింది.
- దాదాపు 100 మంది కళాకారులు వివిధ రాష్ట్రాల నుంచి 110 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా.. స్థానికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ఒకేచోట వివిధ రకాల హస్తకళ వస్తువులు..

- క్రాఫ్ట్‌బజార్‌లో హస్తకళాకారులు తయారు చేసిన ఎంబ్రాయిడరీ, బ్లాక్ ప్రింటింగ్, పెయింటింగ్, జువెలరీ, టెర్రాకోటా, కార్పెట్, గ్లాస్ వర్క్స్, విభిన్న క్రాఫ్ట్‌లు, వెదురు, పింగాణితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి విభిన్న రకాల హస్తకళ వస్తువులను ఈ క్రాఫ్ట్ బజార్‌లో అమ్మడంతో పాటు ప్రదర్శనకు ఉంచారు.

సందర్శకులకు ఉచిత ప్రవేశం..

హస్తకళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి దాదాపు 110 స్టాల్స్‌కు ఉచిత ప్రవేశం కల్పించాం. దీనికి విశేష స్పందన వస్తోంది. అన్ని రకాల వస్తువులు అందుబాటు ధరలోనే ఉన్నాయి. రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శనలు జరిగాయి.

బీసీ కులగణన చేపట్టాలని కేంద్రమంత్రికి వినతి



రాందాస్ అథవాలేతో గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ: బీసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, న్యూఢిల్లీ ఇన్‌చార్జ్ కర్రీ వేణుమాధవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్ సాగర్, కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాలేను ఢిల్లీలో కలిశారు. శనివారం బీసీల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి అందజేశారు.

'నిర్విరామగాన లహరి' రికార్డు నమోదు

చిక్కడపల్లి: త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమీ రికార్డు నమోదు చేసింది. ఇషాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు పెరి నాగేశ్వర్‌రావు, విజయలక్ష్మీలతో పాటు త్రినాథరావు, టీవీరావు, లలితారావు, కల్యాణి, దేశ్‌పాండే, వసంత, ప్రసన్న, సౌమ్య, శివ రామకృష్ణ తదితర 12మంది గాయకులు పాల్గొని సుమారు 150 పాటలను పాడి ప్రతిభను చాటారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన సినీగీత గానలహరి రాత్రి వరకు నిర్విరామంగా సాగి రికార్డు సాధించింది. ముఖ్య అతిథిగా కామేశ్వరరావు, కార్యదర్శి విజయలక్ష్మి యోగ్యతా పత్రాన్ని అందుకున్నారు. బింగి నరేంద్రగౌడ్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో శ్రీద్యుతి సంస్థ ప్రయోగం నమోదు చేసినట్లు ప్రకటించారు. కందాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తా : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నాలా బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: నాలా పరివాహక ప్రాంతాల్లో నష్టపోతున్న బాధితులకు తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం నల్లకుంట డివిజన్‌లో హుస్సేన్‌నగర్ నాలా విస్తరణలో నష్టపోతున్న బాధితులతో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని రత్నానగర్, దయానంద్‌నగర్‌లో ఉన్న నాలాతో భవన యాజమానులకు ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై పారదర్శకంగా సర్వే చేయించి నివేదిక ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. అర్హులైన అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ అరుణ, అధికారులు పాల్గొన్నారు.

సీతారాములకు లక్ష పుష్పార్చన



నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. శనివారం అర్చక స్వాముల మంత్రోచ్చరణలతో సీతారాములకు అభిషేకించి 108 తామర పువ్వులతో పుష్పాభిషేకం చేశారు. అనంతరం వేద మంత్రోచ్చరణల మధ్య లక్ష పుష్పార్చన, మంత్ర పుష్ప నీరాజనం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది.

- సోమవారంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్య నిర్వహణాధికారి కె.జయంతి ప్రకటించారు. భక్తులందరూ కోవిడ్ నిబంధనలను పాటించాలని ఈఓ కోరారు.

మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేత



మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవాడిగూడ: నిమ్స్ ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేటివ్ అడిషనల్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ కృష్ణారెడ్డి రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కలిస్తానని చెప్పి వారికి వైద్యం చేయకుండా తిరిగి పంపించిన ఆయనను విధుల నుంచి తొలగించాలని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి నందగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావును కలిసి నిమ్స్‌లో జరుగుతున్న పరిణామాలపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి తక్షణమే నిమ్స్ డైరెక్టర్‌కు లేఖ ద్వారా సమాచారం అందించి పూర్తి వివరాలను తెలియజేయాలని ఆదేశించారన్నారు.

ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్‌కు సత్కారం



శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వాహకులు వెంకట్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట: శ్రీరామ నవమి శోభాయాత్ర విజయవంతం కావడానికి తోడ్పాటును అందించిన ఈస్ట్ జోన్ డీసీపీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. నిర్వాహకులు బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌గౌడ్, బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో నష్టపోయిన 25 వేల మంది అభ్యర్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని కేంద్ర కార్యాలయంలో 'నిరుద్యోగుల ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్తు ప్రణాళికలు' అనే అంశంపై తెలంగాణ నిరుద్యోగ భేరి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించే పద్ధతిలో యూపీఎస్సీకి అప్పగించాలన్నారు. ప్రతి ఏటా రాష్ట్రంలో 3 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తి చేసుకుంటున్నారన్నారు. గడిచిన 8 ఏళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎంత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందో లెక్కలు చెప్పాలని.. కోటి ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్రం మోసం చేసిందని ఆరోపించారు. నాయకులు దొంతు ఆనంద్, బొంసం ఊర్మిల తదితరులున్నారు.

'ప్రతిపక్షాలపై అనాగరిక అణచివేత సరికాదు'



లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కవాడిగూడ: ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే ప్రతిపక్షాలపై అనాగరిక పద్ధతులను ప్రయోగించి అణచివేతలకు గురిచేస్తూ.. కేంద్ర ప్రభుత్వం భయంకరమైన పాలన కొనసాగిస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకార్ ధ్వజమెత్తారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో 'మోదీ హటావో... దేశ్‌కో బచావో' నినాదంతో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడి ఎమర్జెన్సీ కంటే దారుణంగా ఉందన్నారు. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ లాంటి సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ పార్టీ ఆదేశాలకు లొంగిపోతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు కేంద్రాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సల్, జాతి వ్యతిరేకులు, దేశద్రోహం పేరిట ముద్రలు వేస్తూ.. తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, శోభన్, ఎస్‌కే అన్సారీ, ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు మజీద్ తదితరులున్నారు.

డ్రైనేజీ సమస్యకు మోక్షం

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ దాయర మార్కెట్‌లో లీకైన డ్రైనేజీ పవిత్రనగర్, ఉదయ్‌నగర్, తదితర ప్రాంతాల మీదుగా ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన చిలకలగూడ జలమండలి డీజీఎం మోహన్‌రావుతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరగా.. ఆయన సిబ్బందితో పూడికతీత పనులను చేయించి సమస్యను పరిష్కరించారు.

బీజేపీ పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'గావ్ గావ్ ఓబీసీ – ఘర్ ఘర్ బీజేపీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 'గావ్ గావ్ ఓబీసీ – ఘర్ ఘర్ బీజేపీ' కార్యక్రమ ఉద్యమ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఓబీసీ మోర్చా నేతలు శ్రీధర్, రమేష్, చంద్రశేఖర్, రవికుమార్, వెంకటేష్, ఎంబీ కిషోర్, ఎస్.వెంకటస్వామి, నరేష్, మధు, రాజేష్, సత్యనారాయణ లాల్ తదితరులున్నారు.

పదోతరగతి విద్యార్థులకు మెట్రిక్స్ బాక్సుల పంపిణీ

కవాడిగూడ: పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న పేద విద్యార్థులకు 'మా ఆఫ్ కీ ఛాయా స్వచ్ఛంద సంస్థ సహకారంతో అప్సా ప్రతినిధులు మెట్రిక్స్ బాక్స్‌లు, పెన్నులు అందించడం అభినందనీయమని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. శనివారం దోమలగూడలోని భారత స్కాటెన్ గైడ్స్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు చిక్కడపల్లి ఎస్సై నాగరాజుతో కలిసి మెట్రిక్స్ బాక్స్, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలను రాయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌గంగపుత్ర, ఓబీసీ మోర్చా నగర నాయకులు కుమార్‌గౌడ్, అప్సా కో–ఆర్డినేటర్ రమేష్, ప్రతినిధులు శ్రావణి, లావణ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు అనురాధా తదితరులున్నారు.

3న నారాయణగూడ డివిజన్ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం

కాచిగూడ: జలమండలి నారాయణగూడ డివిజన్ రిజర్వాయర్‌లోని 600 ఎంఎం డయా ఇన్‌లెట్ స్లూయిజ్ వాల్వ్ రిపేర్, 450 ఎంఎం డయా ఔట్‌లెట్ మెయిన్‌కు జరుగుతున్న లీకేజీని అరికట్టడానికి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు జలమండలి అధికారులు ప్రకటించారు. దీంతో ఈనెల 3న సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనులు జరుగుతున్నాయని దాదాపు 8 గంటలపాటు వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు ప్రకటించారు.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు..

గాంధీనగర్ సెక్షన్ : అశోక్‌నగర్, ఎస్ఆర్టీ క్వార్టర్స్, టీఆర్టీ క్వార్టర్స్, జవహర్‌నగర్, పీఅండ్‌టీ క్వార్టర్స్.

నారాయణగూడ సెక్షన్ : విఠల్‌వాడీ, చంద్రానగర్, సంజయ్‌గాంధీనగర్, హిమాయత్‌నగర్, కింగ్‌కోఠిలోని కొన్ని ప్రాంతాలు.

బర్కత్‌పుర సెక్షన్ : చెప్పల్‌బజార్, కుత్బిగూడ, నింబోలిఅడ్డ, రత్నానగర్, మోతీమార్కెట్ ప్రాంతాలు.

సుల్తాన్‌బజార్ సెక్షన్ : బొగ్గులకుంట, రామ్‌కోఠి, చౌదరిబాగ్ కూరగాయల మార్కెట్.

హిందీనగర్ సెక్షన్ : మాలకుంట రోడ్డు, ఉస్మాన్‌గంజ్, శంకర్‌బాగ్, రిసాల అబ్దుల్లా.

గౌలిగూడ సెక్షన్: గౌలిగూడ కమాన్, మహారాజ్‌గంజ్, ఓల్డ్ ఫీల్‌ఖానా, బేగంబజార్, కిషన్‌గంజ్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్ షిప్- 2023 పతకాల ప్రదానం



రజతం సాధించిన సాయి హన్సిక

కాచిగూడ: ఆంధ్రప్రదేశ్ కర్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్ -2023 పోటీలను నెల్లూరులోని ఎల్ఎల్ఎఫ్ స్కూల్ వేదపాలెంలో జరిగాయి. ఒలంపిక్ గేమ్‌కు రాష్ట్రం నుంచి చక్రట్ సాయి హన్సిక పాల్గొని రజతం సాధించింది. ఆర్.క్రాసివన్, మోనాలిసా, మదిరాజు, నాగ అక్షయలు రజత పతకాలను సాధించారు. ఆర్ఎస్ కీర్తిమిశ్రా దివ్యరాణి, భవాని, అతర్వాలు కాంస్య పతకాలను సాధించారని కోచ్ భాను, లక్ష్మీ చైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోచ్‌లు మాట్లాడుతూ.. ఫ్లోర్ కర్లింగ్ గేమ్ నేషనల్ చాంపియన్ షిప్ మే నెలలో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతాయని దానికి టీమ్స్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇది నూతన గేమ్ అయినా.. పిల్లలు చాలా త్వరగా నేర్చుకుని పతకాలను సాధించడం సంతోషకరమన్నారు.

స్పీడ్‌కు 'బ్రేకులు'..

సాక్షి ఎఫెక్ట్



స్పీడ్ బ్రేకర్లకు మరమ్మతులు చేసిన దృశ్యం

నల్లకుంట: తిలక్‌నగర్ రోడ్డులో వాహనదారులు స్పీడ్ బ్రేకులు లేకపోవడంతో అతివేగంగా దూసుకురావడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయాన్ని శనివారం 'స్పీడ్ బ్రేకర్లు వేయండి' అనే కథనం సాక్షిలో ప్రచురితమైన సంగతి తెలిసిందే. స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు ఈ వీధిలో అసంపూర్తిగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను పూర్తిగా వేయించారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో వాహనాల అతివేగానికి అడ్డుకట్ట వేసినట్లయిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి



ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కవాడిగూడ: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ.. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. శనివారం ధర్నాచౌక్‌లో ఒక్కడే తన కారుకు డిమాండ్లతో కూడిన బ్యానర్ ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, రవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మణిక్‌రెడ్డిలు హాజరై మద్దతు ప్రకటించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గాంధీనగర్ పోలీసులు ధర్నాచౌక్‌లో ధర్నాకు అనుమతి లేదని నర్సిరెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

డ్రైనేజీ పైప్‌లైన్‌ను ఆధునీకరించాలని వినతి

ముషీరాబాద్: పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్‌ను ఆధునీకరించాలని బీఆర్ఎస్ నాయకుడు పూస గోరఖ్‌నాథ్ జలమండలి అధికారులకు విన్నవించారు. శనివారం ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ కార్యాలయంలో డీజీఎం మోహన్‌రాజ్‌ను కలిసి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ముషీరాబాద్ డివిజన్‌లోని జెమినికాలనీ, రామాలయం ఎదురు వీధిలో ప్రజలు డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైప్‌లైన్ అస్తవ్యస్తంగా మారడంతోనే ఈ సమస్య ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన డీజీఎం సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కాలనీ వాసులు రమేష్‌గౌడ్, బాలనర్సింహ్మా, యాదయ్య, శ్రీధర్‌గౌడ్, విఠల్, జనార్దన్ తదితరులున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383